
మొగుడు పెట్టిన కష్టాలకు
అతని ఆఖరు నిమిషాల్లో
ఆ భార్య ప్రతీకారం
తీర్చుకుందా?

# దొరువు



ఆకాశంలో వేగుచుక్క అప్పుడేపొడిచినట్లుంది. ఉదయం కొంచెం దూరంలో ఉందేమో, కోడికూడా కూసింది. చీపేట ప్రజలు దొరువు నీళ్లకోసం బార్లుతీరి నిల్చున్నారు. ఆ వూరికి ఈ దొరువు ఒక్కటే దిక్కు. దొరువు అనేది ఆ ప్రాంతంలో చెలిమ లాంటిది. ఎండాకాలం అదొక్కటే దిక్కు. కొండ ప్రాంతంలోనూ, రాళ్లపడేచోటా ఎక్కువగా వుండేది. ముత్తికూడా కడవతో నిల్చుంది. తనవంతు రావాలి కదా. రాయలసీమలో చిన్నపల్లెటూరు చీపేట. చెరువులో నీళ్లుంటే బావులు నిండుతాయి. ఎండాకాలం. చుక్క నీరు దొరకదు. తనెరిగినప్పటినుండి ఇక్కడ నీటి ఎద్దడే. తెల్లవారుజామునుంచి వంతుకు నిల్చోకపోతే తాగేందుకు గుక్కెడు నీళ్లుకూడా దొరకవు. నీటిచుక్క, కన్నీటిచుక్క ఎంత విలువైనవి. ఒకటి ప్రాణం నిలబెడ్తుంది. ఇంకోటి బాధలనుండి ఉపశమనం కలిగిస్తుంది. అయితే ముత్తికి ఈ రెండూ దూరమే. దొరువు (బావి) నీళ్లలాగే తన కళ్లలో కన్నీటిచుక్కలు లేవు. ఉన్నా అడుగునెక్కడో దాక్కుని వుంటాయి. అవీ ఒక్కగానొక్క మాల్యాద్రికోసం.

చింతచెట్టుక్రింది దొరువు (బావి). తను తోడుకొందుకు చాలా టైం పట్టేట్లుంది. జనంవైపు, బావివైపు మార్చి మార్చి చూస్తుంది. గతంలోకి వద్దనుకున్నా తొంగి చూసింది.

□ ■ □

ముత్యంలా వుండేది గనుక ముత్యాలమ్మ అని పెట్టారు. ముద్దుగా 'ముత్తి' అని పిలుస్తారు. ఇద్దరు తమ్ముళ్లు, పెద్ద ఉన్నవా




ళ్ల కాదుకనుక 'వెంకటేశం' అనే చిన్న వ్యాపారికిచ్చి పెళ్లి చేశారు. అతను అమ్మకూచి. పెళ్లయ్యాక రెండు నెలలు బాగా చూసుకున్నారు. కాని కట్నంకింద బంగారం తెమ్మని ముత్తిని పుట్టింటికి తరిమాడు.

అన్నదమ్ములు ఆఫీసుల్లో గుమాస్తాలు. మధ్యవర్తులద్వారా రాయబారం నడిపారు. వేంకటేశం వినలేదు. వీళ్లకీ పట్టుదల పెరిగి

మూడేళ్లు ఇంట్లో వుంచుకున్నారు. వెంకటేశం మాట విన్లేదుకదా మళ్లీ పెళ్లికోసం తయారైనాడు అమ్మ మాట విని.

ఊరుకుంటే లాభంలేదు. కథ అడ్డం తిరిగితే కోర్టులూ, డబ్బు ఖర్చూ తట్టుకోలేంకదా'' అని అన్నదమ్ములు లోను తీసుకుని సారెతో నగలతో ముత్తిని సాగనంపారు.

మూణ్నెల్లు తిరక్కుండానే అర్జంటుగా రమ్మని ముత్తి ఉత్తరం రాసింది. హడావిడిగా పెద్దతమ్ముడు వెళ్లి కనుక్కుంటే కొంప మునిగినంత పనైంది. నగలు తీసుకెళ్లి ముండకు ఒప్పచెప్పాడు వెంకటేశం. ఏమని నిలదీసిఅడిగితే అత్త మొసలికన్నీరుకార్చింది.

ముత్తి మూడోనెల నీళ్లుపోసుకుంది. పెట్టె సర్దుకుని పెద్దతమ్ముడితో వచ్చింది. నెలలు నిండాక మగబిడ్డను కంది. వెంకటేశం పిల్లాణ్ని చూసేందుకు రాలేదుకదా, వ్యాపారానికి పదివేలు ఇవ్వాలన్నాడు. కనుక వెంకటేశం లేకుండానే పిల్లాడికి నామకరణం చేయించారు 'మల్యాద్రి' అని.

ఐదో నెల 'ముత్తి' బిడ్డతో అత్తారింటికి వచ్చింది. అక్కడంతా ఎడమొహం. భర్త పలకరించడు. పిల్లాడ్ని దగ్గరకు తీయడు. అత్తమాత్రం 'ఈ శనీద్రం మొహం ఎక్కడ దాపురించింది' అనే భావనలో వుంటుంది. ముత్తి టైంకి అన్నం తిని పిల్లాణ్ని చూసుకుంటుంది.

□ ■ □

మల్యాద్రికి ఇప్పుడు ఐదుసంవత్సరాలు. ఎవ్వరిలో మార్పులేదు. 'ముంగి', 'పున్నారి' అని బిరుదులిచ్చి అత్త విసుక్కుంటుండేది. ఎప్పుడూ ముత్తి ఎదురుమాట్లాడదు కష్టాలు దిగమింగడం తప్ప.

వెంకటేశం వాళ్ల అమ్మని ఒంగోలు ఆస్పత్రిలో పరీక్ష చేయించుకుని వచ్చాడు కాన్సరు లక్షణాలున్నాయని చెప్పారట.

మాఅమ్మకి వైద్యం చేయించాలి. మీ అన్నదమ్ముళ్లనడిగి పదివేలు తీసుకురా. లేకుంటే నిన్నేలుకునేది లేదు' వెంకటేశం. కచ్చితంగా చెప్పాడు.

నేరుగా పెద్ద తమ్ముడి దగ్గరికెళ్లింది ముత్తి.

''చీటికి మాటికి డబ్బు పంపాలంటే ఇదేం లక్షాధికార్ల ఇల్లా? కావాలంటే ఇక్కడ ఒక ముద్ద తిని పిల్లాడూ నువ్వూ వుండండి'' అన్న వదిన మాటలకి ముత్తి మౌనంగా వుండిపోయింది.

ముత్తి ఒకరోజు రాత్రి పురాణ కాలక్షేపానికి వచ్చింది. రాగానే వదిన 'ఏం రామాయణం కథ అర్థమయిందా?' అని అడగ్గానే ''ఆ అర్థంగాకేముందంట? ఎవడిమాటో విని సీతమ్మోరిని వదిలేశాడు. ఎగ్గం చేసేప్పుడు సీతమ్మ లేదని బాధపడి బంగారం బొమ్మతో చేసాడు. ఎట్టయితేం, సీతమ్మ లేదని దిగులు పెట్టుకోనెగద'' అని వెంబడే సమాధానం చెప్పింది.

పొద్దుపోయాక టెలిగ్రాం వచ్చింది — 'అత్త మద్రాసు కాన్సరు ఆస్పత్రిలో పోయింది' అని.

ఇది తెలిశాక చాలామంది 'ముత్తికి పట్టిన శని విరగడైంది' అనుకున్నారు. కాని ముత్తి అత్త చావు కబురు వినగానే పిల్లాడితో బయల్దేరి అత్తారింటికి వెళ్లింది.

అక్కడకు పోయింతర్వాత తెలిసింది — టెలిగ్రాం ప్రక్కింటివాళ్లు ఇప్పించారని. భార్యను చూస్తూనే వెంకటేశం 'ఇది

వుంటే నేను మా అమ్మ కర్మలు చెయ్యను. వైద్యంకోసం డబ్బుతెమ్మంటే తేలేదు. ఇప్పుడెందుకు వచ్చిందో అడగండి' అన్నాడు.

ఇదివరకెన్నడూ రాని పరిస్థితి చూసి ముత్తి మొదటిసారిగా నోరు విప్పింది — "కన్న కొడుకుని కాదంటివి — కూడెట్టుకపోయినా కట్టుకున్నదాన్ని కాదంటివి. శుభకార్యాలు గతిలేదు ఎలాగూ. ఈ కర్మలు చూడ్డం కూడా తప్పా?" ఇది విని అందరూ ముత్తి 'ఓహో!' అనుకున్నారు.

□ ■ □

కర్మలు చేసేప్పుడు చల్లనీటి స్నానాలవల్ల రొంప పట్టి తర్వాత గుండె నెమ్ముగా మారింది. ముట్టు అలవాటువలన ఇది ఊపిరితిత్తుల్ని దెబ్బతీసింది. తనకు సేవచేసే దిక్కులేదుగనుక 'ముత్తి'ని వుండమన్నాడు. ముత్తి పగలు కొట్టు అమ్మేది. పిల్లాణ్ని బడికి పంపేది.

ఒకరోజు ఆ వూళ్లో 'బుద్ధుని బుర్రకథ' చెప్పారు. 'రాహుల్ని, యశోధరనీ విడిచిపెట్టే ఘట్టం'వరకూ విని నిద్రొస్తుండడంతో పిల్లాడితో ముత్తి ఇంటికి తిరిగొచ్చింది. 'ఇదేంకత పెళ్లాం పిల్లల్ని వదిలేసి ప్రపంచకం ఉద్ధరిస్తాడా?' అనుకుంది.

ఇంటికి తిరిగొచ్చి చూస్తే వెంకటేశం మంచంమీద లేడు. తెల్లారింది. మళ్లీ నాల్గు రోజులిలాగే తెల్లారింది. ఒక మనిషి చేత తర్వాత కబురొచ్చింది — 'పెదనందిపాడులో తమ్ముడిదగ్గరికెళ్లాడు. ఇష్టమైతే వుండమనీ లేకుంటే తల్లిగారింటికి పొమ్మని' దాని సారాంశం.

వెంకటేశం చేసిన అప్పులకింద మరిది కొట్టును స్వాధీనం చేసుకున్నాడు. పెద్ద తమ్ముడొచ్చి ముత్తినీ, మల్యాద్రినీ తనతో తీసుకెళ్లాడు.

□ ■ □

'వంతొచ్చింది ముత్తెక్కా. ఆలోచిస్తా కూకున్నావ్' అనే ప్రక్కవిడ మాటతో ముత్తి ఈ లోకంలోకి వచ్చింది. దొరువు బావిలో నీళ్లు తోడుకుని ఇంటిముఖం


## మొద్దునిద్ర

"ఏమిటా మొద్దునిద? లేవండి...!"

"ఏమైందీ! బంగారంలాంటి నిద్ర చెడగొట్టావ్! ఎందుకే లేపుతున్నావ్ నన్ను...!"

"డాక్టరిచ్చిన 'నిద్రమాత్ర' వేసుకోకుండా...! 'ఏమిటా మొద్దునిద్ర! ముందీ మాత్ర వేసుకుని పడుకోండి!"

—ఎం.ఆర్.శకుంతల (సికిందరాబాద్)



పట్టింది.

తెల్లారిపోయింది. జనసంచారం పెరిగింది.

ముత్తి ఇంటిముందుకొచ్చింది. కడప దించబోతూ అరుగుమీద మనిషిని చూసి విస్తుపోయింది. మూడో మరిది సుబ్బారావులా వుంది. రాగానే 'ఏం వదినా బాగుండావా ! ఊరబావినుంచా' అని పలకరించాడు. కాని గొంతు అదోలా వుంది. మొహం చాటేసుకున్నాడు.

'ఎప్పుడైనా పలకరిస్తే వీడొక్కడే. వదినమ్మని తీసుకెళ్తానంటుండేవాడు' అని అంటుకుంటూ 'ఎప్పుడొచ్చినవ్' అని ముక్తసరిగా అడిగింది. చెంగుతో ముఖంమీద చుక్కలు తుడుచుకుంటూ.

'ఇప్పుడే, మాల్యాద్రి నిద్రలేవనట్టుంది. పిలిస్తే పలకలేదు. ఇంటికిపోదాం. తొందరగా కానియ్' అన్నాడు.

ముత్తి 'ఎందుకు' అన్నట్టు చూసింది.

'అన్నకు సీరియస్‌గా వుంది. బయల్దేరు'

'సీరియస్సా — ఏంటి జబ్బా' ముక్తసరిగా అడిగింది.

'గుండెనిండా నెమ్ముజేరి ఊపిరాట్టంలేదు. గుండజబ్బేమో, గంటో అరగంటో అంటున్నారు వైద్యులు'

'ఎట్టెట్టా' — అంది. నలభైలో పడిందేగాని అనుభవం, ఆకారం అరవైయేళ్ల ముసలామెలా వుంది. తల పిచికగూడూ, ఆకారం ఉలిపిరికట్టె. కళ్ళు ఎండాకాలంలో రాయలసీమ బావులు.

ముత్తి మాల్యాద్రిని నిద్రలేపింది. వాడు సుబ్బారావుకి నీళ్లిచ్చాడు. 'మీ నాన్న చివరి ఘడియలో వున్నాడ్రా అబ్బీ' అన్నాడు సుబ్బారావు.

'ఆ—' అని ఆవులిస్తూ ఇదేదో కొత్త వింతలా వున్నట్టు చూశాడు మాల్యాద్రి.

'తొందరగా కానియ్ , నీకోసం, పిల్లాడి కోసం అందరూ ఎదురుచూస్తున్నారు'

'ఇంతకు ముందెప్పుడూ నేదే ఇట్టా ఎదురుసూడ్డం' ముత్తి వ్యంగ్యంగా అంది.

'ఇది ఆఖరిసారి. ఇప్పటికే అంతా అయిపోయుండొచ్చు. చూపు వుండాలంటే రావాల' తొందరపెట్టాడు సుబ్బారావు.

'ఏం ఇచ్చాడని రావాలంట? వచ్చి మా అబ్బయ్య తలకొరివిపెట్టాలా?' నిలదీసింది ముత్తి.

'చివరిచూపు అందకుంటే బాధపడ్తవు మరి'

'నిజమే, నా బాధలు పట్టింది ఎవురికి?'

'అవన్నీ తోడకు వదినా! బయల్దేరు'

'నగలుముండకిచ్చినప్పుడు, బిడ్డతో ఎల్లిపొమ్మన్నప్పుడు బాధలేదు. తల్లి కర్మలు కూడా చూడకూడని పాపిష్టిదాన్నా? మమ్మల్ని వదిలి తను తమ్ముడింట్లో కూచున్నాడు. పంచాయితీ జరిపిస్తే పట్టుమని పదిరోజులు కూడు పెట్టనేదు. ఎదిగే పిల్లోడ్ని చూసి బతుకుతుండగాని — లేకుంటే...'' ఆగి కన్నీళ్లు ఒత్తుకుంది. కాని ఆ కన్నీటిచుక్కలు ఎప్పుడో ఇంకిపోయాయి. వాటికి బయటకొచ్చే ఓపిక లేదు. ఈ దొరువు (బావి)లో కష్టాల తాపానికి ఎప్పుడో ఇంకిపోయాయి.

జనం గుమిగూడారు. అందరికీ సంగతి అర్థమైంది. 'మొగుడు చచ్చినాడని కబురొస్తే ఎందుకెళ్లవు ముత్తెమ్మా' అని జనం

సలహా ఇస్తున్నారు. మాల్యాద్రి చూస్తూ నిల్చున్నాడు.

'ఈ లోకంలో ఎంతమంది తాగుబోతులు లేరు, తిరుగుబోతులు లేరు? పెళ్లాల్ని వదిలేస్తున్నారా? అన్నదమ్ములు ఎంతకాలం పెట్టగలరమ్మా. ఈ పూరొచ్చి మహిళా మండలి సాయంతో కుట్టుపనులూ, బొమ్మలు సేయడం నేర్చుకున్నా. పిల్లాణ్ని అంగటిలో గుమాస్తాగా కుదిరించా'

'చూడ్డానికి పాతకాలం మనిషివి. నా బాధలు నన్ను మార్చినయ్. మమ్మల్ని వదిలేసిన మగాడు మొగుడు ఎల్లా అవుతాడు ? వాడు సచ్చినా ఒకటే — బతికినా ఒకటే. పిరికిగా నేను సచ్చే ఆడదాన్నికాదు. మొగుడు సత్తే ముండమొయ్యాలని, కొడుకు తలకొరివి పెట్టాలనీ అనుకోను. రాముడు ఎంత గొప్పోడయితేనేమీ — సీతమ్మని వదిలి పెట్టిండు. బుద్ధుడు కతలో అంతే — తల్లీ పిల్లాడిని వదిలి పెపంచంమీద పోలా? ఇక నే సెప్పేదేమీ లేదు — ఎల్లు సుబ్బారావు — ఎల్లు' ఖచ్చితంగా ముత్తి చెప్పడం చూపి అందరూ ముక్కుమీద వేలేసుకున్నారు.

అవును — ఆమె గుండెలో జాలికి తావులేదు. దొరువు (బావి)లో నీళ్ల తోడంగ తోడంగ ముగ్గురాళ్లూ కరకు బండలూ తగుల్తాయి. ఈ బాధలు ఎప్పుడో గుండెలో కన్నీళ్ల తోడేశాయి.

బండబారిన దొరువు (బావి)లాంటి ముత్తికి వడివడిగా నడిచే పొద్దుకన్నా పొద్దు వెంబడే తిరక్కుండా తలతిప్పకుండా నిలబడ్డ ఆ పొద్దుతిరగని పువ్వు వచ్చింది.

ఎదురుగా పూలకుంపట్లో ఆ పొద్దుతిరగని పువ్వుని చూస్తూ మాల్యాద్రిని అక్కున చేర్చుకుంది ముత్తి.

□ ■ □

